ఈనాటి వ్యావహారిక భాష ఇంకా జాతీయ భాష అనిపించుకోదగిన పరిణతికి రాలేదు. ఇందులో విద్యాభ్యాసం జరగటం లేదు. జాతి యొక్క వైజ్ఞానిక రాజకీయావసరాలకు ఉపకరించే పరిభాష ఇందులో కూడా ఇంకా పూర్తిగా ఏర్పడలేదు. కాని పత్రికలు ముఖ్యమైనవి ఈలోటు తీర్చటానికి కొంత వరకు ఉపయోగపడుతున్నాయి.

ఈ జాతీయ భాష—తెలుగువారి ఏకైక జాతీయభాష—ఏర్పడే నాటికి దీనిమీద తెలుగు వారందరి ప్రభావమూ ఉంటుందా ఉండదా? ఆ విషయం ఈనాడే నిర్ణయించటం సులభం కాదు. విశాలాంధ్రోద్యమం విజయవంతమైతే ఏర్పడే జాతీయ భాషకూ, అది శాశ్వతంగా విఫలమైతే ఏర్పడే జాతీయభాషకూ తప్పక వ్యత్యాసం ఉండితీరుతుంది.

సాంఘిక పరిణామంతోబాటు భాషలో కలిగే మార్పులకు ప్రాముఖ్యం ఉంటుందని నేను శంకించడానికి ప్రధాన కారణం ఇదే. భాషంటే అచ్చంగా మాటలపదాలే అయితే సాంఘిక పరిణామాలు ఆ భాషను అంటవని చెప్పవచ్చును. వివిధ వర్గాలవారూ, ప్రాంతాలవారూ వాడే పదజాలానికి భాషలో ఎట్టి ప్రాముఖ్యమూ ఉండనవసరం లేదు. సాంఘిక వ్యవస్థను బట్టి పదజాలంలో కలిగే మార్పులు భాషను సంబంధించినవి కావనుకోవలసి వస్తుంది.

# గిరీశంగారి సంతానం

## కాలజ్ఞానం సుబ్బారావు

గిరీశంగారంటే ఎవరో అని భ్రమపడాల్సిన అవసరం లేదు. ముప్పై ఏళ్ల క్రితమే 'కన్యాశుల్కం'లో అవతరించిన అద్వితీయ పాత్ర. గురజాడ వారి కలంతో సొగసుగా చిత్రించబడింది గిరీశంగారి ప్రతిభ. గిరీశంగారికి మధురవాణి (వేశ్య) సంపర్కమున్నంతవరకూ సంతానం లేదు. తరువాత బుచ్చమ్మ సంపర్కాన్వేషణ చేసినా తనకు ప్రాప్తించే సమయంలో అవాంతర మాపాదించింది. ముందరే పూటకూళ్ళమ్మ గొడ్డుపోతురాలవడం పాఠకులకి విదితం. పాపులుభావధాన్ల ఆస్తి ఆశించకుంటే గిరీశంగారి బుచ్చమ్మను లేవతీసుకపోయే కార్యక్రమం సక్రమంగా విజయవంతంగా జరిగివుండేది. మరి ఇక గిరీశంగారికి సంతానమెట్లా కలిగిందా అని- యీ రచనకి బిరుదాన్ని చూచి చదువరుల కాశ్చర్యం కలుగుతుందేమో! టెస్టుట్యూబు (పరీక్షనాళికలు) బేబీలు మొదలైన విచిత్రప్రక్రియల కాపుకారం ఉండే యీ రోజుల్లో గిరీశంగారికి ఏదోవిధంగా సంతానం లభించిందంటే నమ్మితీరాలి. పిల్లగుడ్డి అడిగితే సమాధానం ఇది: వృక్షాల్లో బీజవ్యాప్తి, పక్షుల వల్ల, గాలివల్ల, నీటివల్ల, మనుష్యులు, మృగాల వల్ల జరుగుతుందని మనం సైన్సులో చిన్నపాడే చదువుకోవడం జరిగింది. అలాగే గిరీశంగారి ప్రతిభ నలుదెసలు వ్యాపించడంలో గిరీశంగారి బీజాల్ని అక్కడక్కడా నాటినై. తత్ఫలితంగానే గిరీశంగారికి సంతాన ప్రాప్తి. వారెక్కడ? అని ప్రశ్నిస్తారేమో. మీరింకా వాళ్లని అకస్మికంగా కలుసుకునే అదృష్టం పొంది ఉండలేదని తెలిసిపోతూంది. ఓవేళ కలుసుకుని ఉన్నా నాన్న (గిరీశం) గారి పరిచయం లేకపోవడంవల్ల వాళ్ళ ఫలానివాళ్ళని గ్రహించలేకపోయుంటారు. పేరెరిగున్న గిరీశంగారి సుపుత్రుల్ని కొందరిని పాఠకలోకానికి పరిచయం చేస్తాను. ముందుగనే ఒక్కమాట! తండ్రిగుణాలు అన్నీ ఒక్కరికే అబ్బవని అందరూ ఏకగ్రీవంగా ఒప్పుకుంటాము కాబట్టే వీళ్ళలో ఒక్కొక్కడికి నాన్నగారి గుణాలు కొన్ని కొన్నే సంక్రమించినవి. గిరీశంలాంటి సర్వజ్ఞతంత్ర శిఖామణి ప్రతిభా ప్రభావం అతని సంతానానికి అణుమాత్రమయినా అంటకపోవడం అసాధ్యం మనడం నిజం. ఇక గిరీశంగారి ప్రతిభ మాత్రం 'కన్యాశుల్కం' చదివాకనే గ్రాహ్యమౌతుంది. ఊరకే

పార్టీ సంతానాన్ని గురించి ఏవిధమైన అపోహలు పెట్టుకోకండి.

మా ఊళ్లోనే గిరీశంగారి సుపుత్రుడొకడు వుండడం మా అదృష్టం. చాలనాళ్ళకిగాని ఆ విషయం మాకు తెలియదు. బహుశా 'కన్యాశుల్కం' ఆలస్యంగా చదివిన పాపమేమో! మా వాడిపేరు రామనాథశర్మ. మేమంతా శర్మాజీ అంటుంటాం. శర్మాజీ రెండోఫారం కూడా పూర్తిగా చదవలేదు. అంతే. అవూరు వదిలాడు. మళ్ళీ, మేమంతా కాలేజీ చదువులొచ్చే సమయానికి దిగబడ్డాడు. మావాడి ఖాదీ దుస్తులు- గాంధీ కళ్ళాయి అన్నిటికీమించి వాడి వాగ్ధోరణి మమ్మల్ని మేమే నమ్మకుండా చేసినై! 'ఏంరా! శర్మాజీ!...' అని హెచ్చరిస్తే. 'ఏంభాయ్! (హిందీలో నాలుగుముక్కలు నేర్చుకున్నట్లుంది!) రేపు సాయంత్రం మన టౌన్‌హాలులో జరిగే సభకి ఫలానివారు అధ్యక్షులు. నన్నంపారు ఏర్పాట్లు చెయ్యమని ముందుగా. తప్పక హాజరుకావాలి మీరంతా- టైములేదు- మన్నించాలి- నమస్తే!' అంటూ జారుకున్నాడు. తర్వాత తెలిసింది మనవాడి పుక్కిటి పురాణం. నాన్న (గిరీశం)గారి తంత్రం అమలులో పెట్టాడట. గొప్ప నాయకులమని చెప్పుకునేవాళ్ళ (నిజంగా కాదని రూఢిగా చెప్పలేం!) అండ చేరాడు. అదీ వాళ్ళ ఇష్టానిష్టాలతో పని లేకుండా. వాళ్ళకి కాఫీ అందివ్వసాగాడు. కారు తలుపులు తెరవడం, కారు కదిలే సమయంలో ఫలానిచోటికి నాకు లిఫ్ట్ ఇస్తారా' అని, వాళ్ళ బదులు కెదురు చూడకుండానే ఎక్కికూర్చునేవాడు. మార్గ మధ్యంలో వాళ్ళతో తనకు తెలిసిన రాజకీయ జ్ఞానమంతా వెళ్ళబోసేవాడు. మన నాయకులలో ఎక్కువ మంది ఎంత రాజకీయ ధురంధరులో మనకు తెలుసు. వాళ్ళూ 'ప్రచారానికి పనికివస్తాడులే' అని మనవాణ్ణి దగ్గరికి చేర్చేవారు. కొందరివద్ద శర్మాజీ స్వంత కార్యదర్శిగా పనిచేశాడంటే అందులో విచిత్ర మేమీ లేదు. వాళ్ళతో ఒకరి లోపాల్ని ఇంకొకరికి చెప్పేవాడు. మచ్చుకి 'ప్రకాశంగారితో మాట్లాడుతోంటే ఫలాని విషయంగా భిన్నాభిప్రాయాలొచ్చి వెంటనే వచ్చేశాను' అని కళావారితో చెప్పడమో లేక 'ఫలాని జిల్లాకి నాన్‌కాంగ్రెస్ సంఘ (ఊహాలోకంలో) అధ్యక్షుడికి మీ పాలిసీ సరిగ్గా బోధపడలేదని' రంగాగారితోనో నిర్భయంగా నమ్మకంగా చెప్పేవాడు. ఇక అంతేనంటారా! ఏ నాయకుడి ప్రాపకంలోవుంటే వారికిగూర్చి గోరంతలు కొండంతలు. వాళ్ళదగ్గరికి ఏ నెపంతో చేర్చుతారో అది కొనసాగుతుంది. మరి ... 'ఏమయ్యా! రంగాగారూ లేక అఖండ హంగామా అని వ్రాశారే ఆంధ్రపత్రిక ఆదివారం సంచికలో' అంటే, ఆ పత్రికా! దానిమాట నావద్ద లేవద్దు. ఈనాడు ఏ వార్తా పత్రిక్కి స్టాండర్డు ఉంది? అయినా... ఫలాని పత్రికలో రంగా గారి ఉపన్యాస సారాంశం చదివావా!' అని మెల్లగా దిగజారేవాడు. తగినట్టు ధైర్యం మా వాడిలో ఎక్కువ. ఇతర పార్టీ నాయకు డెవరైనా మా వూరికి వస్తే, మీటింగు జరుగుతూంటే సగంలో ధీమాగా లేచి చొప్పదంటు ప్రశ్నల్ని వేసేవాడు. వాళ్ళ తెల్లముఖం వేస్తే తనకది చాల ఉపయోగపడ్తుంది. జవాబు ఏదైనా చెప్పారా దానికి మళ్ళా కుంటి ప్రశ్నల వర్షం కురిపించి కడకు మీటింగు విజయవంతంగా జరిగిందని అనిపించదు. ఊరి వాళ్ళుమాత్రం మనవాడు గొప్పవాడు-పలుకుబడి ఎక్కువ అని పొంగి పోవడం సహజం. కొందరు అమాయకులు మనవాణ్ణి ఆశ్రయించడం కద్దు ఉద్యోగాలకి. ఇదే ఛాన్సు అని వాళ్ళ జేబులు తడుముతాడు. లేకుంటే జీతం బత్తెం లేని మనవాడికి ఆదర్జా ఎక్కణ్ణుంచి వస్తుంది? వాళ్ళకు సాయం చెయ్యడ మాత్రం కలలోని వార్త...

నాయకుల్ని బుట్టలో వేసే మా శర్మాజీకి ఎం.ఎల్.ఎ. లంటే లెక్కలేదు. కోతలుకోయడం- బుట్టలో పెట్టడం మావాడికి వెన్నతో పెట్టిన విద్య. అచ్చం గిరీశంగారి పోలిక. కొందరు డబ్బున్న తెలివిలేని దద్దమ్మలతో 'ఏదో కంపెనీ పెడదాం - కావలసినదంతా నేనిప్పిస్తాను- మంత్రులు మనవాళ్ళే'నని నిక్కచ్చిగా టెంకాయ కొట్టినట్టుగా చెప్పి సమయానికి హోటల్ గడప ఎక్కే చాతుర్యం మావాడిది. ఆపై ఆ విషయం బుట్టదాఖలు. మనవాడిసంగతి బాగా అనుభవం మీద ఎరిగున్నవా డగుపించాడా తప్పుకుంటాడు

పక్క సందులోంచి. అదే శర్మాజీలోని విశిష్టత. కాలేజీ రోజులలో మద్రాసులో ఆగుపడ్డాడు, ప్రముఖ కాంగ్రెస్ నాయక గోష్ఠిలో ఒకరితో. 'ఏమిట్రోయ్!' అని హెచ్చరిస్తే 'ఉష్!' సామానం కాపాడమని సంజ్ఞలతో ప్రాధేయపడ్డాడు. ఇంకో మారు మా మిత్రుడొకడు, 'ఏ మరి క్వాలిఫికేషన్' అని అడిగితే వెంటనే, తడుముకోకుండా 'గ్రాడ్యుయేటు' నండి- అన్నాడు... ఇక పనిలేని రోజుల్లో ఊళ్ళోనే వుంటే పరుగెత్తుకొని వస్తాడు తియ్యని కల్లిబొల్లి కబుర్లు చెప్పి 'సిగరెట్ ముక్కొకటి పడెయ్యరా' అంటాడు. కొన్ని సమయాల్లో ఏదైనా లెటరూ - దరఖాస్తు ఇంగ్లీషులో వ్రాసివ్వమంటూ రావడం అలవాటే మా వాడికి. మా వూళ్ళోని రాజకీయ ముఠాలో మనవాడు ఒక పార్టీ నాయకుడికి కుడి భుజంగా వుంటాడు. సభలేర్పాట్లు చేసి దర్జాగా దంచుతాడు ఉపన్యాసాల్ని స్టేజెక్కి. మమ్మల్ని ఎక్కబెట్టుతాడు. ఒక్కసారి ఆ అనుభవం జరిగింది లెండి. దెబ్బలకి దెయ్యమన్నా భయపడుతుందేమో కానీ మనవాడు చలించడు. దెబ్బలు తిననిదే జైళ్లప్రవేశించనిదే రాజకీయవేత్తలవటం కష్టం అంటాడు. సమయం వస్తే అబద్ధమాడడం శర్మాజీకి తేలికైన పని. మా మీదా రుద్దుతాడు తప్పుల్నంతాను. మనవాడితో పొత్తు అధికంగా వుంచడం ఆపదే. ఇల్లాగే జీవితం సగం వరకు సాగించాడు. డామిట్! కథ అడ్డం తిరగదు కదా మనవాడి విషయంలో!...ఏమో!...గిరీశానికే తప్పలేదు.

ఇప్పుడు నేనుండే వూళ్ళోనే హోటల్లో మా ప్రక్క రూములోనే ఉంటున్నాడు గోపీనాథ్. గిరీశంగారి సంతానంలో ఒకడైనా, చవక రకం. నాన్న (గిరీశం) తన ప్రయత్నాల్లో విఫలుడైనప్పుడెట్లుంటాడో ఆ విధంగా ప్రవర్తిస్తాడు గోపీ. గోపీకి ఖర్చు ఎక్కువ - రాబడి తక్కువ తనకి తల తీసేంత ప్రమాదం సంభవించినా ఒక 'ట్రాజిక్ లాఫ్'తో దాన్ని తుడిచి పారేస్తాడు. ఇంతకుముందు పూనాలో ఉండేప్పుడు అక్కడ సుమారు మూడొంద లక్కడక్కడా అప్పు చేసాడట. అక్కణ్ణుంచి బదిలీ ఇక్కడికివచ్చింది, టెలిగ్రాఫ్ ఆఫీసు గుమాస్తాగా. అప్పిచ్చినవాళ్లు వీణ్ణి జైలులోపడేయిస్తే స్నేహితులు చందా వేసి తప్పించారు. ఇక్కడ అదే ధోరణి మళ్ళీ. సంపాదించినదంతా ఋణమే. అడిగిన వాళ్ళకి తెల్లముఖం- ఖాళీ పర్సు చూపి ఏడవలేని నవ్వు నవ్వుతాడు. త్రాగుడు పిచ్చి ముందు ఉండేదిట! ప్రణయవ్యవహారాలలో గ్రంథసాంగుడగుటచేత పిల్లనిస్తామన్న వాళ్లెవరూ కనుపించలేదు. ఇంటికి కంటకమై నెట్టబడ్డాడు బయటికి. సిగ్గనేది వదిలాడు. దుఃఖం దిగమింగుకోవడానికి పిల్లవాడికి మళ్లీ గంతులేసి గగ్గోలు పెట్టడం సాధనం. బడాయి చెప్పుకోవడం గిరీశంగారి సొత్తే. బుచ్చమ్మతో తండ్రి (గిరీశం) యాడిన మాటల్ని ఇంకో సందర్భంలో గోపినోట వినవచ్చు. బుట్టలో బోర్లా కొట్టిస్తాడు సరికొత్తవాళ్ళని. అనుభవంఅయ్యాక జారుకుంటారంతా. ఆఫీసులో యజమాని తిడితే 'ఇంకా తిట్టమని' నవ్వుతాడు. మాట్రిమోనియల్ కాలమ్స్ కి దినమ్మా జవాబులు వ్రాస్తాడు. డబ్బు యీవిధంగా దండగ చేస్తాడు — కాఫీకి డబ్బులేకుంటే ఎవరైనా- ముఖం ఎరుగనివాణ్ణయినా- జంకులేక యాచిస్తాడు తియ్యగా. ఏనాడో హృద్రోగం సంప్రాప్తించి కథ అడ్డం తిరగడం నిజం. ఎరిగున్నవాళ్ళం మేము జాగ్రత్తగా మసులుకుంటున్నాం. వాడివాతబడే ఆహారాన్ని చూస్తున్నాం కూడా. ఏంచెయ్యడం!

దేశంనిండా గిరీశంగారి సంతాన మిలా వ్యాపించి పోయింది. గురజాడవారి ఘంటం యింత శక్తివంతమైనదని 'కన్యాశుల్కం' చదివాకగాని తెలీదు.

---

అంతర్జాతీయ ఖ్యాతిపొందిన ఐంద్రజాలికులు పి. సి. సర్కార్, (ఇండియా) గోగియా పాషా, (ఈజిప్టు) యీమధ్య కలకత్తా, పారిస్ పట్టణాల రాజవీధుల్లో కళ్లకు గంతలు కట్టుకుని సైకిళ్లు తొక్కారట. మన మంత్రులు తరుచు దేశంలో చేసే పర్యటనలముందు అదేమంత గొప్ప అని శంకర్స్ వీక్లీ వ్యాఖ్య.